

పాలనలో మార్పునకు సిద్ధం

- జిల్లా కలెక్టర్, జెసి బదిలీ..?
- కొత్త అధికారుల నియామకంపై కసరత్తు
- పేర్లను పరిశీలిస్తున్న అధికార పార్టీ నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పరిపాలనలో మార్పుకు సిద్ధమయింది. రాష్ట్ర స్థాయి నుంచి కింది స్థాయి వరకు ఉద్యోగుల బదిలీలను చేపట్టాలని సిద్ధమయ్యారు. జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ బదిలీలను మొదలుకొని ఇతర ఉన్నతాధికారులు ఉద్యోగులు సిబ్బంది బదిలీలను చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పరిపాలనలో గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులను పక్కన పెట్టేసి తమ అనుకూలమైన అధికారులను నియమించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు ,పోలీసు విభాగంలోని ఉన్నతాధికారులను మార్పు చేసేందుకు చర్యలు చేపట్టారు. కలెక్టర్, జెసితోపాటు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కూడా అనేకమంది గత ప్రభుత్వం హయాంలో నియమించిన వారు అధిక సంఖ్యలో ఉన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం వెంటనే ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల పనితీరుపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుండి నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులను మొత్తం బదిలీ చేసేసి కొత్తగా వేరే అధికారులు నియమించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ లకు సంబంధించిన పనితీరు నివేదికను కూడా సిఎంఒ అధికారులు తీసుకున్నట్లు సమాచారం. ఇద్దరు ఉన్నతాధికారులు గత ప్రభుత్వ సహాయంలో అప్పటి ప్రజాప్రతినిధులకు అనుకూలంగా వ్యవహరించారనే నేపథ్యంలో వీరిని తప్పనిసరిగా బదిలీ చేయాలని అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు భావిస్తున్నారు. జిల్లా కలెక్టర్ నియామకానికి సంబంధించి ఇప్పటికే అధికార పార్టీకి చెందిన నేతలు కొంతమంది తమకు అనుకూలమైన అధికారుల పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. గతంలో ఇక్కడే జాయింట్ కలెక్టర్లుగా విధులను నిర్వహించిన ఇద్దరు ఉన్నతాధికారులను ఇక్కడికి కలెక్టర్‌గా తీసుకువచ్చేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు సమాచారం. జాయింట్ కలెక్టర్ కూడా తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు పేర్లను సిఫార్సు చేసినట్లు తెలిసింది. ప్రస్తుత జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ ను కూడా బదిలీ చేస్తే తమకు అనుకూలమైన స్థానాలను పొందేందుకు ప్రభుత్వ పెద్దలను సంప్రదించినట్లు తెలిసింది. ప్రజాప్రతినిధులతో వారికి ఉన్న పలుకుబడిని పట్టి ఇక్కడే కూడా ఉండవచ్చనే చర్చకూడా నడుస్తోంది. జిల్లాలో దాదాపుగా మూడు సంవత్సరాలకు పైగా పనిచేస్తున్నటువంటి ఉన్నతాధికారులు అనేకమంది ఉన్నారు. వీరందరూ గత ప్రభుత్వ హయాంలో నియమించిన వారు కావడంతో వేరే జిల్లాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. మరి కొంతమంది ఉన్నతాధికారులు కూడా ఇక్కడే ఉండేందుకు అధికార పార్టీ నేతలతో సిఫార్సు చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగుల బదిలీలను కూడా రెండు మూడు నెలల్లోగా చేపట్టేందుకు ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. మండల స్థాయిలోని రెవెన్యూ శాఖలో పనిచేసే తహశీల్దార్లు ఎంపిడిఒలను కూడా బదిలీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మూడు నెలలకు పైగా ఎన్నికల విధుల నిర్వహణ పేరుతో సొంత జిల్లాలో పనిచేస్తున్న తహశీల్దార్లు ఎంపిడిఒలను వేరే జిల్లాలో పనిచేస్తున్నారు. వీరందరిని రాష్ట్ర ప్రభుత్వం సొంత జిల్లాలకు కేటాయించిన వెంటనే ఆయా మండలాల్లో వీరికి పోస్టింగ్ ఇచ్చేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

సాగుకు సన్నద్ధం

- ఖరీఫ్ విత్తుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- కార్యాచరణ సిద్ధం చేసిన అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నైరుతి ప్రభావంతో తొలకరి వర్షాలు కురవడంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఖరీఫ్ విత్తు కోసం భూములను సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌కు సాగుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు..



తొలకరి వర్షాలు కురవడంతో సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ముందు జాగ్రత్తగా వ్యవసాయ శాఖ అధికారులు కార్యచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లాలో కురిసిన వానలతో అన్నదాతలు భూములు చదును చేయడంలో నిమగ్నం అయ్యారు. ఖరీఫ్ సాగు గత ఏడాది కంటే ఈసారి ఇంకా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులు ఏ మేరకు అవసరమవుతాయనేది అధికారులు కార్యాచరణ రూపొందించారు. పంటలసాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేవిధంగా వ్యవసాయాధికారులు చర్యలు ప్రారంభించారు. ఈసారి ఖరీఫ్ సాగుకు ప్రధాన పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఏ పంట విత్తనాలు ఎంత మేర అవసరమవుతాయనేది అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించింది. అందుకు సంబంధించి ఇప్పటికే అన్ని సిద్ధం చేశారు. పంటల సాగులో ఎంతో ముఖ్యమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులు అధికారులు ఇచ్చే సూచనలు వాడాల్సిన కంటే ఎక్కువగా ఎరువులు వాడడంతో అదనంగా ఎరువులు తెప్పించాల్సి వస్తుందని అధికారులు అంటున్నారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సాగు 4,19,219 హెక్టార్లలో జరుగుతుంది. ఇందులో ప్రధానంగా పత్తి 2,43,689 హెక్టార్లు, వేరుశనగ 58,969, కంది 25,557, ఆముదం 9,231, మిరప 29,998, ఉల్లి 15,698, వరి 12,771, ఇతర పంటలు 23,306 హెక్టార్లలో సాగు ఉంటుంది. రాయితీ విత్తనాలను అధికారలు సిద్ధం చేశారు. వేరుశనగ క్వింటం 9500 రూపాయలు, రాయితీ 40 శాతం పోగా రైతు చెల్లించాల్సింది 5700 రూపాయలు. జీలుగా 8800 రూపాయలు రాయితీ 50 శాతం పోగా 4400 రైతు చెల్లించాలి. పిలిపెసర రూ.13400, రాయితీ 50 శాతం పోగా 6700 రైతు చెల్లించాలి. అలాగే పత్తి అధికంగా సాగు జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా పత్తి ప్యాకెట్స్ అందుబాటులో ఉంచారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు చాలా ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నైరుతి రుతుపవనాలు కూడా జూన్ మొదటి వారమే రావడం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పుష్కలంగా వర్షాలు పడుతున్నాయి. జూన్ మాసంలో సాదారణ వర్షపాతం కంటే 67 శాతం అధికంగా నమోదు అయింది. ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉంటుందని ఇప్పటికే వాతావరణ అధికారులు తెలిపారు. రైతులకు ఖరీఫ్ మంచి దిగుబడులు ఇవ్వాలని అందరూ ఆశించిన పంటలు పొందాలని కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రైతులు జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలి. ప్రతి విషయంపై వ్యవసాయ అధికారులతో సలహాలు సూచనలు తీసుకోవాలి. సొంతంగా ఎలాంటి మందులు, విత్తనాలు వినియోగించకండి. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా అదేశించాము. ఎలాంటి సమస్యలకైనా సంప్రదించవచ్చు. ఏదైనా కల్తీ, లేదా అధిక ధరలకు విక్రయం జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించవచ్చు. పత్తి ప్యాకెట్ రూ.864 కంటే ఎక్కువ తీసుకుంటే ఫిర్యాదు చేయండి. తీసుకున్న దానికి రసీదు ఖచ్చితంగా తీసుకోవాలి. ఎరువులు యూరియా, డిఎపి అన్నిరకాల ఎరువులకు ఎలాంటి కొరత లేదు.

- పిఎల్ వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జెడి.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

- ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-తుగ్గలి

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రామలింగాయపల్లి గ్రామంలో పిడుగుపడి మృతి చెందిన వారి కుటుంబసభ్యులను ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు తెలిపారు. పిడుగు పాటుకు గురై మృతి చెందిన సుంకన్న, రామేశ్వరి మృతదేహాలను సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడుగుపడి ఇద్దరు గొర్రెల కాపరులు మృతి చెందడం బాధాకరమన్నారు.. వర్షాకాలంలో పొలాలకు వెళ్లే రైతులు, ఆవులు, గొర్రెలు కాచే కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రకతి వైపరీత్యంతో జరిగిన ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా చూస్తానని ఎంపి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు, మాజీ ఎంపిపి కొమ్ము వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు నబి రసూల్, టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటపతి, వెంకట స్వామి, మాభాష,తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ నాగరాజు

ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి: సిపిఎం, సిపిఐ

తుగ్గలి మండలం పరిధిలోని రామలింగయ్య పల్లికి చెందిన ఎరుకల కామేశ్వరి, ఎరుకల సుంకన్న పిడుగు పడి మృతి చెందడంతో ఆ కుటుంబానికి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.25 లక్షలు చెల్లించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విపత్తువల్ల జరిగిన సంఘటనకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆ కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ముస్లింలు బక్రీద్ పండుగ నగరంలో ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కర్నూలు నగరంలోని పాత ఈద్గాలో గవర్నమెంట్ ఖాజీ సయ్యద్ సలీంబాషాఖాద్రీ ఈద్ నమాజును చదివించారు. ఈద్గాలో మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ నగరంలోని ముస్లిం పెద్దలు బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొత్త ఈద్గా (సంతోష్‌నగర్)లో ముక్తి సయ్యద్ మన్సూర్ అహ్మద్ ఈద్ నమాజ్ చదివించారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి.మోహన్ రెడ్డి, కెఎం.ఇంతియాజ్ నమాజ్ చదివారు. ఈద్ నమాజ్ అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని మసీదులలో నమాజులను చదివారు. ఇబ్రహీం, ఇస్మాయిల్‌ను స్మరించుకుంటూ కుర్బానీ ఇచ్చారు. మాంసాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగం తమ ఇంటిలో ఉంచుకొని మరొక భాగం బంధువులకు, మూడవ భాగం పేదలకు పంచి పెడుతూ నగరంలో చిన్న పిల్లలు మొదలు కొని పెద్దలవరకు ఒకరిని ఒకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ముస్లింలు ఇళ్లకు హిందువులను ఆహ్వానించి దూద్‌కుర్మా, బిర్యానీలను వడ్డించి ఆరగించారు.



బక్రీదు ప్రాధాన్యతను వివరిస్తున్న ప్రభుత్వ ఖాజీ, పాల్గొన్న నగర ప్రముఖులు,

హాఫీజ్‌ఖాన్ శుభాకాంక్షలు: ముస్లింలకు వైసిపి రాష్ట్ర మైనారిటీ విభాగం నాయకులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న పాత ఈద్గాలో ఈద్‌ఉల్‌ఆధా నమాజ్ మత పెద్దలతో కలిసి చేశారు. నగర ముస్లింలందరికీ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. రాయల్ ఫంక్షన్ హాల్ వైసిపి కార్యాలయంలో పార్టీ నాయకులు కార్యకర్తలు హాఫిజ్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పత్తికొండ: పత్తికొండలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక పాతపేటలోని అహలే సున్ని జామియా మసీద్ ఈద్గా నందు హాఫీజ్ ఫారూఖ్ నిజామీ బక్రీద్ పండుగ విశిష్టతను, ప్రాముఖ్యతను ప్రసంగించారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగ నిరాతిని వ్యాపింప చేయడమే బక్రీద్ పండుగ ఉద్దేశమని అన్నారు. పెద్ద ఎత్తున సామూహిక ప్రార్థనలో ముస్లింలు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జామియా మసీద్ కమిటీ సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.

తుగ్గలి: తుగ్గలి, జొన్నగిరి, ఎర్రగుడి, చెన్నంపల్లి, రాతన, పెండేకల్ ఆర్ఎస్, హుసేనాపురం ఎంపీ కొట్టాల, కడమకుంట్ల , రాంపల్లి తదితర గ్రామాలతో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లిం సోదరులు ఉదయాన్నే ఊరేగింపు ద్వారా మసీదుకు చేరుకొని అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తమ ఆరాధ్య దైవమైన అల్లాను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. తుగ్గలిలో కోఆప్షన్ సభ్యులు చాంద్‌బాష, సర్పంచి కమాల్‌బాష, అన్వర్‌బాష, సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, మాబాష, రంజాన్, సుభాన్, సయ్యద్ బాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



కర్నూలు నగరంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

పలువురు సిఐలు బదిలీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు రేంజ్ పరిధిలో కడప జిల్లాలో పనిచేస్తున్న వివిధ సర్కిల్ పరిధిలో పని చేసే సిఐలకు స్థానభ్రంశం కల్పించినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ సిహెచ్ విజయరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప విఆర్‌లో ఉన్న జైశివశంకర్ ను మైదుకూరు రూరల్ స్టేషన్‌కు బదిలీ చేశామని తెలిపారు. అక్కడ పనిచేస్తున్న ఎం.శ్రీనాథరెడ్డిని కడప విఆర్‌కు పంపారు. కర్నూలు రేంజ్ విఆర్‌లో ఉన్న డి రామాంజనేయులు మైదుకూరు అర్బన్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎపి మస్తాన్‌ను కడప విఆర్‌కు పంపుతూ బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు.

ప్రజాధనం దుర్వినియోగంపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గత ప్రభుత్వ హయాంలో ప్రజాధనం దుర్వినియోగంపై సిబిఐ విచారణ చేపట్టాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె. బలరాం డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. విశాఖపట్నంలో రుషికొండలో విలాసవంతమైన భవనాల నిర్మాణాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందన్నారు. రాయలసీమలో ప్రాజెక్టుల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులను కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక దోపిడీపై విచారణ సిబిఐ ద్వారా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు డేవిడ్, పద్మానంద యోగి, శ్రీరాములు, తెలుగు గోవిందు, శివకుమార్, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు

అందరికీ వెయిటేజ్ మార్కులు కలపాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రకటించబోయే ఎపి డీఎస్సీ 2024లో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉపాధ్యాయ పోస్టులకు అర్హత కలిగిన అందరికీ వెయిటేజ్ మార్కులు కలపాలని కర్నూలు జిల్లా మండల విద్యాశాఖ అధికారుల అధ్యక్షులు శ్రీనివాసులు అన్నారు. సోమవారం కర్నూలు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కర్నూలు సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా మాట్లాడుతూ సమగ్ర శిక్షలో అందరికీ వెయిటేజ్ మార్కులు కలపాలని, ఇది న్యాయమైన డిమాండ్ అని తెలియజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జెఎసి జిల్లా అధ్యక్షుడుచంద్రశేఖర రాజు తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజక వృత్తిదారులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటినీ కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని రజక ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ కోరారు. జిల్లా అధ్యక్షుడు సి. ముక్కన్న అధ్యక్షతన వీరనారి ఐలమ్మ కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సి. గురుశేఖర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంపార్టీ 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాత రజక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఫెడరేషన్ ద్వారా రజక వృత్తిదారులకు పనిముట్లు, రుణాలు ఆర్థిక సహకారం అందించేవారన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా చేసి నిధులు కేటాయించకుండా కాలయాపన చేసిందన్నారు. తక్షణమే రజక కార్పొరేషన్‌కు రూ. 1000 కోట్ల బడ్జెట్ ను కేటాయించాలన్నారు. గతంలో ఫెడరేషన్ ద్వారా రజక సొసైటీలను రాష్ట్రంలో వేల సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి గత ఫెడరేషన్లను పునః ప్రారంభించాలన్నారు. సొసైటీలకు కార్పొరేషన్ ద్వారా బ్యాంకుతో నిమిత్తం లేకుండా 90శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని కోరారు. నేటికీ కూడా రజక వృత్తిదారులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని వాటిని అరికట్టేందుకు మన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నిరోదక చట్టం తరహాలో సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గీత మత్స్య చేనేత కార్మికులకు ఇచ్చిన విధంగా సామాజిక సేవ వృత్తి చేసే రజక వత్తిదారులందరికీ రూ.5000 పెన్షన్ మంజూరు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరి ఇంటి దగ్గరే ఇస్త్రీ చేసే వారందరికీ కేటగిరి వన్ కింద ఉచిత కరెంటును అమలు చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ రజక లాండ్రీ షాపులకు, దోభీఘాట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తానని హామీ ఇచ్చారని, దాన్ని అమలుపరచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రభుత్వ శాఖలలో దోబీ పోస్టులను రజక వృత్తిదారులను నియమించాలని కోరారు. ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ కౌశల్య యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని, చాలామంది ఆన్‌లైనల్‌లో దరఖాస్తు చేసుకున్నారని, నేటికీ విశ్వకర్మ కౌశల్య యోజన లబ్ధిదారులకు అకౌంట్లో డబ్బులు జమ కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సి.హనుమంతు, జిల్లా ట్రెజరర్ సిహెచ్.శ్రీనివాసులు, జిల్లా సహాధ్యక్షులు పర్ల సుంకన్న, సి శేషాద్రి, సి. జయమ్మ, జిల్లా సహకారదర్శులు సి ,రాముడు, శేఖర్ బాబు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజక వృత్తిదారుల జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

ఆ దారిన నడిచేదెలా?...

ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి పట్టణంలో శ్రీరేణుక ఎల్లమ్మతల్లి, గంగమ్మ దేవాలయాలకు, రైతులు పొలాలకు వెళ్లే దారిలో నివాస గృహాలకు ఆనుకొని నేలమోరి కల్వర్టు ఉంది. వాగులో నుంచి వచ్చే నీరు నేలమోరి బ్రిడ్జ్ కల్వర్టులో ఉన్న పైపుల గుండా వాగులోకి వెళ్లేవి. గతంలో వచ్చిన భారీ వర్షాలకు నేలమూరి బ్రిడ్జి వంతెన తెగిపోవడంతో మోరీ కింద ఉన్న పైపులతో సహా కొట్టుకుపోయాయి. అప్పటికి ప్రత్యామ్నాయంగా వరదకు కొట్టుకుని పోయిన చోట తాత్కాలికంగా గ్రావెల్ మట్టితో పూడ్చారు. పైపులు వేయకపోవడంతో వాగులో నుంచి వచ్చే మురుగునీరు గుడికి వెళ్లి దారిలోకి వచ్చి నివాస స్థలాలకు ఆనుకొని నిల్వ ఉంటున్నాయి. ప్రతిరోజు ఆ దారి గుండానే వందల సంఖ్యలో శ్రీ ఎల్లమ్మ, గంగమ్మ దేవాలయాలకు భక్తాదులు వెళుతుంటారు. వెల్దుర్తి నుండి కాకుండా చుట్టూ ఉన్న గ్రామాల నుండి కూడా భక్తులు వస్తుంటారు. గుడికి వెళ్లాలన్నా, ఆదారిగుండా వెళ్లాలన్నా మురుగునీటిలోనే వెళ్ళవలసి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పొలాలకు ఎద్దుల బండ్లతో ఆ దారి గుండానే వెళ్లాలి. దారి సరిగా లేకపోవడంతో వేరే దారి గుండా వెళ్లాలంటే చాలా దూరం అవుతుందని వాపోతున్నారు. సమీపంలోనే నివాస గృహాలు ఉండడంతో మురుగునీరు నిలువ ఉండడంతో దుర్వాసన వస్తుందని దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని వాటి వల్ల రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దారికి కల్వర్టు నిర్మించి మురుగునీరు నిలవకుండా ఆ దారికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య బ్లీచింగ్ చేయాలని, ప్రజలు రోగాల బారిన పడకుండగా చూడాలని కోరుతున్నారు.



ఈ దారిన నడవడానికి ఇబ్బంది పడుతున్న ప్రజలు



పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే దారి దుస్థితి

ఆస్పత్రికి వెళ్లాలంటే గుంతలోకి దిగాల్సిందే


ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలంటే గుంతలోకి దిగాల్సిందేనని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ,తుగ్గలి,మద్దికేర మండలో గ్రామీణ ప్రాంతాలలోని రోగులు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తూ ఉంటారు. ఆటోల్లో గర్భవతులు వృద్ధులు గుంతులో దిగి వెళ్తుంటే నానా అవస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డాక్టర్లు గుంతలు దాటి ఆసుపత్రికి వెళ్లాల్సిందే. కానీ పట్టించుకోవడంలేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు, ఆర్అండ్ బి అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని రోగులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పత్తికొండ సూపరిన్‌టెన్‌డెంట్ స్పందించి గుంతలను పూడ్పించాలని రోగులు కోరుతున్నారు.

జగన్ పతనానికి ఆయనే కారణం

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్



మాజీ సీఎం జగన్ పొగరబోతుతనమే ఆయన పతనానికి కారణమైందని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఐదేళ్ల జగన్ పాలనను ప్రజలు ఛీకొట్టి తిరస్కరించారని విమర్శించారు. సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఆవరణలో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి జగన్ పాలనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక పాలన చేస్తూ, సలహాదారుల మాటలు వింటూ జగన్ ఆయన సమాధి ఆయనే కట్టుకున్నారాని వ్యాఖ్యానించారు. ప్రజల డబ్బుతో వైజాగ్‌లోని రుషికొండ ప్యాలెస్ నిర్మాణాలే జగన్ రాజరిక పాలనను గుర్తు చేస్తాన్నాయని అన్నారు.ప్రభుత్వం రైతుల భూములు గ్రామాల్లో సర్వే చేస్తే రైతుల పొలాలకు వేసే హద్దుల రాళ్ళకు, పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ పేరు, ఫోటోనా ,జగన్ ప్రజా పాలనా లేక రాజరిక పాలననా అంటూ ఆరోపించారు. బడి పిల్లలకు అందించే చెక్కిలు, కోడి గుడ్లపై కూడా జగన్ బొమ్మలా ఇదెక్కడి న్యాయమన్నారు. మళ్ళీ రాష్ట్రమంతా తిరుగుతా అంటున్న జగన్‌కు చేదు అనుభవం తప్పదన్నారు. గతంలో కోడికత్తి, గులకరాయి డ్రామాలు ప్రజలు చూసారన్నారు. మళ్ళీ జనం మధ్యకు వస్తే కోడిగుడ్లు, చెప్పులతో ప్రజలు సమాధానం చెబుతారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వడ్డెరలు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

- వడ్డే ఓబన్న సేవా సమితి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - హోళగుంద

వడ్డెరలు ఐకమత్యంతో మెలగాలని, రాజకీయంగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని వడ్డే ఓబన్న సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఓర్సు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పీట్ల రాము కోరారు. సోమవారం స్థానిక మండలంలో నిర్వహించిన వడ్డెర ఐకమత్య కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎరుకల, యానాది, లంబాడీలతో కలుపుకొని విముక్తి జాతులుగా జీవిస్తూ ఉన్న వడ్డెరలను మళ్లీ తిరిగి ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. దేశంలో 13 రాష్ట్రాల్లో వడ్డెరలు ఎస్సీ, ఎస్టీలుగా పరిగణించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో బీసీ'ఎ'లుగా గుర్తించడంతో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వారికి అందకుండా పోతున్నాయని చెప్పారు. వడ్డెరలు ఐకమత్యంతో మెలిగి వడ్డెరుల గన్ను బండలపై కాదు రాజ్యాధికారంపై ఎత్తాలని కోరారు. వడ్డెర సేవా సమితి మండల అధ్యక్షులు ఎర్రిస్వామి, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు మారెన్న, అంజని, శినప్ప, వెంకటేష్, మరి స్వామి, నాగేంద్ర, హనుమంతు, తాయప్ప పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు


టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరూ కలిసి రావాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. వైసిపి నుంచి టిడిపిలో 50 కుటుంబాలు టిడిపి ఇందిరా నగర్ ఇన్‌ఛార్జీ, అడ్వకేట్ ఐసి.రామకృష్ణ ఆధ్వర్యంలో చేరాయి. సోమవారం ఆదోనిలోని మీనాక్షి నాయుడు నివాసం వద్ద వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. కక్ష సాధింపు వంటి చర్యలకు తావు ఇవ్వకుండా పరిపాలన సాగుతుందన్నారు. ఇంద్రానగర్ మాజీ కౌన్సిలర్ నాగరాజు, కెడిసిఎంఎస్ మేస్త్రి కృష్ణకు చెందిన 50 కుటుంబాలు చేరిన వారిలో ఉన్నారు. టిడిపి సీనియర్ నాయకులు వలీ పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన చల్లా వరుణ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి, జనసేన పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మిగనూరు జనసేన నాయకులు చల్లా వరుణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారి అఖండ విజయానికి సోమవారం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే గుమ్మనూరును కలిసిన కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను ఆలూరులోని నివాసంలో టిడిపి ఆదోని మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. గుమ్మనూరు జయరామ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత ఉపాధ్యక్షులు రామకృష్ణ, వడ్డెమాన్ గోపాల్, రాంభీమ్ నాయుడు, టిడిపి నాయకులు ఉన్నారు.


జయరామ్‌ను కలిసిన గుడిసె ఆది కృష్ణమ్మ

రోడ్లు గుంతలమయం...

- వాహనదారుల ఇక్కట్లు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు నియోజకవర్గ కేంద్రంలో రోడ్లు గుంతలమయమయ్యాయి. గుంతల రోడ్లతో వాహనదారులు, ప్రజల ఇక్కట్లు పడుతున్నారు. ఆదోని నుంచి చింతకుంట వరకు 167వ జాతీయ రహదారి నిర్మాణం ఏళ్లు గడిచినా పూర్తి కాలేదు. ఉన్న రహదారిని తొలగించిన గుత్తేదారులు ఎస్ఆర్‌కె కన్‌స్ట్రక్షన్ పనులు ఆపి వేయడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం భారీ వాహనాలు, ఆటోలు, బస్సులు, ఇతర వాహనాలు ఆలూరు నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమైంది. గుంతల రోడ్డులో వెళ్తూ ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి.

అధికారులు, పాలకులు నిర్లక్ష్యం : కెపి.నారాయణస్వామి, సిపిఎం నాయకులు

ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో ఉన్న ఆలూరు నియోజకవర్గ కేంద్రంలో రోడ్ల నిర్మాణంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. నూతనంగా వేసిన బిటి రోడ్లు ఐదేళ్లు కాకముందే గుంతల మయంగా మారుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తికాలేదు. ప్రజలు, వాహనదారులు దుమ్ము, ధూళి, ప్రమాదాలకు గురవుతున్న పాలకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత నాయకులు, అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలి.


ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ముందు


ఆలూరు నుంచి కర్నూలు వెళ్లే రహదారి



రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగరూరు ఆర్ఎస్ సమీపంలో చోటు చేసుకుంది. సోమవారం రైల్వే ఎస్ఐ గోపాల్ వివరాల మేరకు... ఆదోని మండలం పెసలబండ గ్రామానికి చెందిన యువకుడు సలేంద్ర ఈశ్వర్ (20) రైలు పట్టాలపై తీవ్ర రక్త గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసు దర్యాప్తులో సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతిని తండ్రి వెంకటేశులు హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆత్మహత్య గల కారణాలు తెలియాల్సి ఉంది.

గ్రామాల్లో జనసేనను

బలోపేతం చేస్తాం

- నియోజకవర్గ ఇన్‌ఛార్జీ లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న తెలిపారు. సోమవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కల్యాణ్ కృషి, పట్టుదల, త్యాగాల ఫలితంగా రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 19న పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో ఆయనకు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, పార్టీ జెండా ఆవిష్కరణలు చేశామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారని, కానీ స్వల్ప తేడాతో ఎన్‌డిఎ కూటమి ఓడిపోయిందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సమిష్టిగా కృషి చేసి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. నాలుగు మండలాలకు జనసేన మండల అధ్యక్షులను ప్రకటించి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. కౌతాళం మండల నాయకులు చిన్న, సుమిత్ర, రమేష్, తిక్కయ్య, కోసిగి మండలం నుంచి ఈరెడ్డి, వెంకటేష్, పెద్దకడబూరు మండలం నుంచి ముని, అబ్రహాం, మంత్రాలయం మండలం నుంచి వెంకటేష్, నరసింహ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మన్న

కాటికాపరులకు ఉపాధి కల్పించాలి

- కాటికాపరి గుంతలుతీసే బేగరుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - ఆదోని

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఉపాధి కల్పించాలని కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్‌డి.ఆనంద్‌బాబు, ఎన్‌జి.కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తిక్కస్వామి దర్గా వెనుక ఉన్న శ్మశాన ఘాట్ వద్ద కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతేడాది కాలంగా జిల్లాలో సామాజిక వృత్తిని నిర్వహిస్తున్న కాటికాపరుల సమస్యలపై నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. కర్నూలు నగరంతో పాటు రాష్ట్ర రాజధాని విజయవాడలో సైతం ఆందోళన నిర్వహించినా గత ప్రభుత్వం కాటికాపరుల సమస్యలు పరిష్కారం పక్కన పెడితే, దానిని ఒక వృత్తిగా గుర్తించే ప్రయత్నం కూడా చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం దళితులైన కాటికాపరుల సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. పరిష్కరించేలా కార్యకర్తలంతా మరింత చైతన్యంతో కృషి చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కంటే భయంకరమైన వ్యాధులు ప్రబలే శ్మశానాలే ఆవాసాలుగా ఉంటూ వృత్తిని నిర్వహించే కాటికాపరుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని తెలిపారు. ఉపాధి కల్పించే వరకు వివిధ రూపాల్లో ఉద్యమించేందుకు సిద్ధం కావాలని కోరారు. కెజిబిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు యువరాజు, వీరేష్, రాజా రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు ఈశ్వరయ్య, రంగన్న, నాగశేషులు, జిల్లా నాయకులు ఆదోని మునిస్వామి, గోనెగండ్ల మల్లికార్జున, కౌతాళం తాయన్న, మారయ్య, జయరామ్, ఎమ్మిగనూరు ఈరన్న, ఆనంద్, రంగన్న, మల్లికార్జున, మంత్రాలయం నరసన్న, నరసప్ప, కోడుమూరు ప్రకాశం, నందవరం రాజు, రాజప్ప, కర్నూలు మద్దిలేటి, పెద్దకడబూరు నరసింహులు, రామాంజనేయులు, వెంకన్న, రంగస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

నిరుపయోగంగా బస్టాండ్

- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

చాలాకాలం క్రితం నిర్మించిన బస్టాండ్ నేడు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో నిర్మించిన బస్టాండ్ నేడు ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. బస్టాండ్‌ను పూర్తిగా వినియోగంలోకి తేవాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. కొద్దిపాటిగా నిర్మించిన భవనంలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలం చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏళ్ల తరబడి

సంవత్సరాలు గడుస్తున్నా బస్టాండ్ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అన్నచందంగా మారింది. రోజూ ఇతర గ్రామాల నుంచి విద్యార్థులు, ప్రయాణికులు, ఎడవల్లి, బలాదూర్, హనవాల్లు గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. చాలా కాలం క్రితం నిర్మించిన బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

- రవి, గ్రామస్తుడు

బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఆర్‌టిసి అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. బస్టాండ్ శిథిలావస్థలో ఉండడంతో కుక్కలకు నిలయంగా మారింది. వినియోగంలో లేకపోవడంతో బస్టాండ్ ఆవరణ మొత్తం చెత్తాచెదారంలో పేరుకుపోయింది. ఇతరులు వాహనాలు నిలుపుతూ బస్టాండ్‌ను దుర్గంధంగా మారుస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి.


నిరుపయోగంగా ఉన్న సంతేకుడ్లూరు బస్టాండ్

ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో బక్రీద్ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పండగ సందర్భంగా ముస్లింలతో కలిసి ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆదోనిలోని జామియా మసీదులో నమాజ్ చేశారు. సహనం, ప్రేమ, త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే పండగ బక్రీద్ అని, సమస్త మానవాళికి శాంతి, సౌభ్రాతృత్వం చేకూరాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. చందా సాహెబ్ దర్గా, మాస మసీదు, గుల్షన్ రోస్ దర్గా, ఇతర దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదులో జరిగిన ప్రార్థనలో మసీదు ట్రష్టి సౌదీ రావూఫ్, ముస్లిం మత పెద్ద కాజీ అల్తాఫ్ హుస్సేన్, టిడిపి ముస్లిం సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్సర్ బాష, ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ముజిబా అహ్మద్ హాజరయ్యారు. జామియ మసీదు వద్ద ఇండియా వేదిక నాయకులు దేవిశెట్టి ప్రకాష్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా డీఎస్పీ శివ నారాయణ స్వామి, ట్రెయినీ డీఎస్పీ దిరాజ్ ఆధ్వర్యంలో సిఐలు తేజ మూర్తి, గోపీనాథ్ సమక్షంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **చిప్పగిరి** భంభం సాహెబ్ వద్ద ఉన్న ఈద్గాలో, నేమకల్లు స్థానిక బస్టాండ్ దగ్గర ఉన్న మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భంభం సాహెబ్ వంశీయులు డాక్టర్ ఆరిఫ్ ఉద్దీన్ ఖాద్రీ, సయ్యద్ హర్షద్ ఖాద్రీ, నేమకల్లు గడ్డం వలీ ఇస్లాం మత ప్రవక్తల త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండగను ముస్లింలు జరుపుకుంటారని తెలిపారు. ముస్లిం మత పెద్దలు ముల్లా పెద్ద సత్తార్, కో ఆప్షన్ సభ్యులు సర్వ ఖాన్, అబ్దుల్ మునాఫ్, గుడ్డం సుల్తాన్ సాబ్, షేక్షావలీ, గౌస్ పీరా, షామీర్ బాష, లాలెప్ప, వన్నూరు సాహెబ్ పాల్గొన్నారు. సత్తార్ హాజీ, భంభం సాహెబ్ ప్రత్యేక చదివింపులు నిర్వహించారు. **గోనెగండ్ల**తోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బక్రీద్ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల్లోపు గ్రామాల్లోని వివిధ మసీదులతోపాటు గోనెగండ్లలోని ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. మత గురువులు ఖతీప్ అనస్, రఫీక్, షకీల్ మాట్లాడుతూ... త్యాగానికి ప్రతీక బక్రీద్ పండగ అని తెలిపారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలిపారు. **కౌతాళం** మండలంలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక జామియా మసీదు, మదీనా మసీదు, నూరాణి మసీదు, మసీద్-ఎ-అక్స నుంచి ఈద్గా మైదానానికి ముస్లింలు చేరుకొని నమాజ్ నిర్వహించారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జగద్గురు ఖాదర్ లింగస్వామి దర్గాలో కూడా నమాజ్ నిర్వహించారు. మండలంలోని కామవరం, ఎరిగేరి, బదినేహాలు, కుంటనహాలు, ఉపరహాలు, బాపురం, చిరుతపల్లి, చూడి, హాల్వి, నదిచాగి, గుడికంబాలి తదితర గ్రామాల్లో బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు కుర్బానీ ఇచ్చారు. **మంత్రాలయం** మండలంలోని ముస్లింలు బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. స్థానిక జామీయ మసీదు ఇమామ్ ఖాజా బందేనమాజ్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అక్కడి నుంచి ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ పండగ ప్రాముఖ్యత గురించి ఇమామ్ చదివి వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు గాజుల బాష, సాబ్ జాన్, నూర్ అహ్మద్, ఫకృద్దీన్, ఖాజా హుస్సేన్ తాత, పింగాణి ఖాజా, షాబువలీ, అక్బర్ వలీ, మాబాష, నన్నే సాబ్, బాష, అక్బర్ వలీ, నూర్, రఫీ, చాంద్, ఖాజా, అమీన్ పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ ఎరిషావలీ ఆదేశాల మేరకు మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్, మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అలాగే మండలంలోని మాధవరం గ్రామంలోని టిడిపి నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి స్వగృహంలోని టిడిపి కార్యాలయంలో బక్రీద్ పండగ వేడుకలు జరుపుకున్నారు. టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డిని ఆయన సోదరులు రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తనయుడు రాకేష్ రెడ్డి, రాజారెడ్డిని ముస్లింలు శాలువా, గజమాలతో సన్మానించి, మిఠాయిలు తినిపించుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. **హాలహర్వి**లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని చింతకుంట, గూళ్యం గ్రామాల్లో మసీద్ ఈద్గాలో బక్రీద్ విశిష్టతను, ప్రాముఖ్యతను ప్రసంగిస్తూ వేడుకలు జరుపుకొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో బక్రీద్ పండగ ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఈద్గాలో మత గురువు సయ్యద్ మహ్మద్ పీర్ సాబ్ ఉపన్యాసం చేశారు. ముందుగా ఎస్‌బిఐ దగ్గర ఉన్న ఉద్గా వద్ద రోడ్డుపై ముస్లింలు ప్రార్థనలు చేశారు. **హోళగుంద** మండలంలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ పెద్దయ్య నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. **దేవనకొండ** మండలంలోని వివిధ గ్రామాల్లో బక్రీద్ వేడుకలను నిర్వహించుకున్నారు. దేవనకొండలో ముస్లింలు మసీదుల వద్ద నుంచి ఊరేగింపుగా ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడారు. త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ రోజున దానధర్మాలు పేదలకు చేయడం మంచిదని తెలిపారు. **పెద్దకడబూరు** మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ పండగ అని ముస్లిం మత గురువులు బోధించారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.


గోనెగండ్లలో ఈద్గా వద్ద ప్రార్థనలో ముస్లింలు


ఎమ్మిగనూరులో బోధిస్తున్న మత గురువు


ప్రార్థన చేస్తున్న ముస్లింలు


మంత్రాలయం మండలంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


మంత్రాలయం మండలంలో శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


ఆదోని జామియా మసీదులో ప్రార్థనకు హాజరైన ఎమ్మెల్యే పార్థసారథి


ఆదోనిలో శుభాకాంక్షలు తెలుపుతున్న దేవిశెట్టి ప్రకాష్


చిప్పగిరి భంభం స్వామి ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు

బోధిస్తున్న ముస్లిం మత పెద్ద


దేవనకొండలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు


కౌతాళం మండలంలో


పెద్దకడబూరు మండలంలో


హోళగుందలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


హాలహర్వి మండలంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు